# వేదిక

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

నమస్తే తెలంగాణ

## 'సమ్మె'ట పోటు

**లారీ** డ్రైవర్ల సమ్మెతో దేశంలోని అనేక ప్రాంతాల్లో రహదారులు కిక్కిరిసిపోయాయి. దీంతో దేశ రవాణా వ్యవస్థ ఉక్కిరిబిక్కిరైంది. సరుకు రవాణా స్తంభించడంతో సామాన్యులు విలవిల్లాడిపోయారు. ట్యాంకర్ల మెరుపు సమ్మెతో ఇంధన సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పెట్రోల్ బంకులకు వాహనదారులు ఎగబడటంతో దేశంలో గందరగోళ పరిస్థితులు తలెత్తాయి. పలు రాష్ర్టాల్లో, ముఖ్యంగా ఉత్తర, పశ్చిమ ప్రాంతాల్లో డ్రైవర్లు వీధుల్లో ప్రదర్శనలు జరిపారు. భారతీయ శిక్షాస్మృతి స్థానే ఇటీవల కేంద్రం ప్రవేశపెట్టిన భారత న్యాయ సంహిత (క్రిమినల్ ప్రొసీజర్ కోడ్)లోని కొన్ని నిబంధనలకు వ్యతిరేకంగా లారీ డ్రైవర్లు సమ్మెకు దిగారు. ముఖ్యంగా వాహనదారులు మరో వాహనాన్ని గానీ, పాదచారులను గానీ ఢీకొని పోలీసులకు ఆ సమాచారమివ్వకుండా ఉడాయించే 'హిట్ అండ్ రన్' కేసులకు సంబంధించిన శిక్షలపై వారు నిరసన తెలియజేస్తున్నారు. ఈ తరహా ఘటనలు పెచ్చరిల్లుతున్నాయనే ఉద్దేశంతోనే కేంద్రం కఠినమైన చట్టాలను తెచ్చిన మాట వాస్తవమే. అయితే న్యాయసంహితలోని 106/2 నిబంధనలో.. ఇలాంటి నేరాలకు శిక్షాకాలాన్ని ఒక్కుమ్మడిగా రెండేండ్ల నుంచి పదేండ్లకు పెంచడాన్ని లారీల యజమానులు, డ్రైవర్లు వ్యతిరేకిస్తున్నారు.

దేశంలో సుమారు కోటి మంది దాకా డ్రైవర్ వృత్తిలో ఉన్నారు. వారిలో అత్యధికులు సమ్మెలో పాల్గొన్నారు. దీని ఫలితంగా సోమ, మంగళవారాల్లో 60-70 శాతం లారీలు రోడ్డెక్కలేదు. తాజా నిబంధనను వెనక్కి తీసుకోకపోతే డ్రైవర్ వృత్తిని చాలామంది వదిలేస్తారని, కొత్తవారు రావడానికీ జంకుతారని అఖిల భారత మోటర్ ట్రాన్స్‌పోర్ట్ కాంగ్రెస్ (ఏఐఎంటీసీ) అంటున్నది. దేహానికి రక్తనాళాల వ్యవస్థ ఎలాంటిదో దేశానికి సరుకు రవాణా వ్యవస్థ అలాంటిది. అందులో డ్రైవర్ పాత్ర చాలా కీలకం. వారు కుటుంబాలకు దూరంగా, సరైన భోజన వసతి లేకుండా, పద్మవ్యూహం లాంటి వాహనాల వలయంలో, విపరీతమైన ఒత్తిడితో పని చేస్తుంటారు. అలాంటి పరిస్థితుల్లో పొరపాట్లు, తప్పులు, ప్రమాదాలు జరగడం సహజమే. కొన్నిసార్లు అవతలివారి తప్పుల వల్ల కూడా ప్రమాదాలు జరిగి ప్రాణాలు పోవచ్చు. నిర్లక్ష్యంగా వాహనం నడపటాన్ని నివారించాలనే ఉద్దేశంతో శిక్షలు వచ్చాయన్నది గమనార్హం. ఇప్పుడు ఒక్కసారిగా శిక్షలను ఐదింతలకు పెంచడం సమ్మెకు కారణమైంది. దీనికి రాజకీయ పార్టీలు మద్దతు పలికాయి. పేదలను బలి చేస్తున్నారని విపక్షాలు గగ్గోలు పెడుతున్నాయి. కొత్త నిబంధనలు ఇంకా అమల్లోకి రాలేదని, ఏఐఎంటీసీని సంప్రదించిన తర్వాతనే తుది నిర్ణయం తీసుకుంటామని కేంద్రం అంటున్నది.

నిబంధనలు రూపొందించిన తర్వాత సంప్రదింపులు జరపడం విజ్ఞతాయుతం అనిపించుకోదు. పైగా విపక్ష ఎంపీలను పెద్దసంఖ్యలో సస్పెండ్ చేసి, హడావుడిగా చట్టాలు చేసి దేశం మీద వదిలే సంస్కృతి మంచిది కాదు. గత సమావేశాల్లో రికార్డు స్థాయిలో 146 మంది ఎంపీలను సభ నుంచి బయటికి పంపించిన సంగతి తెలిసిందే. మందబలం ఉంది కదా అని వెనుకాముందూ చూడకుండా పాలకపక్షం తనకు ఇష్టం వచ్చిన రీతిలో చట్టాలు చేయడం వల్ల తప్పులు జరిగి.. దేశానికి, ప్రజాస్వామ్యానికీ ముప్పు ఏర్పడుతున్నది. ఫ్యూడల్ ప్రభువుల ఫర్మానాలకు, పార్లమెంటరీ ప్రజాస్వామ్య చట్టాలకు మధ్య తేడా సంప్రదింపులే. చర్చలు జరపకుండా పాలకపక్షం తన అభీష్టాన్ని దేశం మీద రుద్దడం 'ప్రజాస్వామిక నియంతృత్వం' అవుతుంది. ముందుగానే సంబంధిత భాగస్వామ్య పక్షాలను, అన్నిపార్టీలను సంప్రదించి, పార్లమెంటులో లోతుగా చర్చించిన తర్వాతనే నిబంధనలు రూపొందించి ఉంటే దేశ ప్రజలకు ఈ అవస్థలు తప్పేవి.

---

**ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ అబద్ధాలు ప్రచారం చేయటాన్ని అర్థం చేసుకోవచ్చు. ప్రజలను నమ్మించి గెలవాలి గనుక ఆ పని చేశారనాలి. కానీ, గెలిచిన తర్వాత కూడా అవే అబద్ధాలు కొనసాగించటం ఎందుకన్నది ప్రశ్నగా మారింది. తాము గెలవటంతో ప్రజలకు నిర్బంధాలు తొలగిపోయి స్వేచ్ఛ వచ్చిందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అంటున్నారు. కానీ, తనవైపు నుంచి ఆయన అవే పాత అబద్ధాలు మళ్లీ మళ్లీ చెప్తూ, వాటిని ప్రజలు ఇప్పటికీ నమ్మేట్టు వారిని మేధో నిర్బంధం, లేదా బ్రెయిన్ కండిషనింగ్, థాట్ కంట్రోలింగ్ చేయజూస్తున్నారు. అటువంటి మేధో నిర్బంధంతో ప్రజలను నమ్మించి గెలిచిన తర్వాత, తమ హామీల అమలులో వైఫల్యాలు జరిగినా, ప్రజల్లో వ్యతిరేకత రాకుండా ఉండేందుకు అవే అబద్ధాలతో మేధో నిర్బంధపు టెక్నిక్‌ను వారిపై కొనసాగిస్తున్నారు.**

**అబద్ధాలు ఏమిటన్న దానికి కొన్ని ఉదాహరణలు చూద్దాం. అందులో కొన్ని సాక్షాత్తూ ఐదుగురు మంత్రుల సమక్షంలో గత శుక్రవారం నాడు, మీడియా సాక్షిగా బయటపడ్డాయి. అది జరిగింది మేడిగడ్డ ప్రాజెక్టు వద్ద వారు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ చేసినప్పుడు. ప్రాజెక్టు నిర్మాణంలో ఒక భాగం దెబ్బతినటం, అందుకు ఇంజినీరింగ్ లోపాలు కారణం కావటమన్నది ఎవరూ కాదనలేని వాస్తవం. దానిపై ఒకవైపు దర్యాప్తులు, మరొకవైపు మరమ్మతులు అన్నవి జరగాల్సిందే. కానీ, దీనంతటిలో అవినీతి జరిగిందా అనేది ఒక ముఖ్యమైన ప్రశ్నగా ముందుకువచ్చింది.**

# గెలిచినాకా అబద్ధాలెందుకు ?



**టంకశాల అశోక్**



మళ్లీ ఈ ప్రశ్నలో మూడు ఉప ప్రశ్నలున్నాయి. ఒక ప్రాజెక్టుకు సహేతుకంగా కాగల ఖర్చును బాగా పెంచి చూపి ఆ అదనపు సొమ్మును కైంకర్యం చేయటం ఒక తరహా అవినీతి. ఇట్లా అంచనాలు పెంచటం గానీ, ఎస్టిమేట్-ప్రొక్యూర్-అండ్ కన్‌స్ట్రక్ట్ తరహా సరికొత్త విధానాలు తెచ్చి కాంట్రాక్టర్లకు ప్రాజెక్టు నిర్మాణానికి ముందే భారీగా అడ్వాన్సులు ఇస్తూ అందులో కమీషన్లు తీసుకోవటం గానీ, తెలంగాణ రాకముందు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పాలనలో ఎంత విచ్చలవిడిగా జరిగేవో అందరికీ తెలిసిన విషయమే. ఈ తరహా అవినీతి ఏమైనా కాళేశ్వరంలో జరిగిందా అన్నది మొదటి ఉప ప్రశ్న. ఇది జరిగి ఉంటే, రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన న్యాయ విచారణ ముందు ఆధారాలు చూపి రుజువు చేసే అవకాశం రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి ఎప్పుడూ ఉంటుంది. నిజమని తేలితే బాధ్యులను శిక్షించాలి.

ఇక రెండో ఉప ప్రశ్న పైన అన్నట్టు ఖర్చు అంచనాలు, కమీషన్ల సంగతి ఎట్లున్నా యథాతథంగా నిర్మాణంలోనే ఏదైనా అవినీతి జరిగిందా అన్నది. అంచనాలు, కమీషన్లలో అవినీతి జరిగినా చివరికి ప్రాజెక్టు బాగానే ఉండవచ్చు కూడా. అట్లాంటివి అనేకం ఉన్నాయి. కనుక, మేడిగడ్డలో ఈ రెండో తరహా అవినీతి ఏమైనా జరిగిందా? పనులకు చార్జీలు మొత్తంగా వసూలు చేసినా పనులు నాసిరకంగా, ఉద్దేశపూర్వకంగా జరిగాయా? అన్నది రెండో ఉప ప్రశ్న. ఇది కూడా న్యాయ విచారణలో తేల్చవలసిన విషయం.

చివరి ఉప ప్రశ్న, కేసీఆర్ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టును తుమ్మిడిహట్టికి బదులు మేడిగడ్డ వద్దకు అనవసరంగా మార్చి నిధులను దుర్వినియోగం చేసిందా, వృథాగా వ్యయం చేసిందా? అనేది. అట్లా మార్చటంలోనూ అవినీతి ఉందంటే అనవచ్చు, ఆ విషయమూ న్యాయ విచారణకు పెట్టదలచుకుంటే పెట్టవచ్చు. అది కొత్త ప్రభుత్వపు స్వేచ్ఛ. కానీ, ఈ విధంగా ప్రాజెక్టు ప్రదేశాన్ని మార్చటమన్నది మౌలికంగా సాంకేతిక అంశాలకు సంబంధించినటువంటిది. ఈ ప్రశ్నలన్నీ మున్ముందు ఎట్లా తేలుతాయన్నది చూద్దాం. అయితే తుమ్మిడిహట్టి సాంకేతికంగా సరైన ప్రదేశం కాదని మొన్న మంత్రుల ఎదుటనే ఇంజినీర్లు చెప్పటం గమనించాలి.

వాటినట్లుంచితే, కాంగ్రెస్ చేసిన, ఇప్పటికీ చేస్తున్న ప్రచారాలలో కొన్ని అబద్ధాలైనట్టు ఈ పాటికే తేలిపోయిందన్నది ఇక్కడ గుర్తించాల్సిన తక్షణాంశం. ఆ మాట ఐదుగురు మంత్రుల సమక్షంలో, సాక్షాత్తూ కాళేశ్వరం సాక్షిగా, మీడియా సాక్షిగా, గత శుక్రవారం నాడు స్పష్టమైంది. అక్కడ మంత్రుల ఎదుటనే ఇంజినీర్లు చెప్పిందేమిటి? మొత్తం మూడు టీఎంసీల ప్రాజెక్టుకు కలిపి అంచనా వ్యయం రూ.1,27,872.28 కోట్లు. అందులో ఇప్పటికి జరిగిన ఖర్చు రూ.93,872.7 కోట్లు మాత్రమే. అటువంటప్పుడు రూ.93,872 కోట్ల ఖర్చులో, లక్ష కోట్ల అవినీతి ఎట్లా సాధ్యం? రాహుల్‌గాంధీ మొదలు, రేవంత్‌రెడ్డి నుంచి కాంగ్రెస్ నాయకులంతా, ఎన్నికల సమయం పొడవునా, రాత్రింబవళ్లు, హైదరాబాద్ నుంచి పల్లెటూరి వరకు, చేసిన ఆరోపణ ఇదే కదా? అదెట్లా సాధ్యమని కేసీఆర్ తదితర బీఆర్‌ఎస్ నేతలు గణాంకాలతో సహా ఎంత వివరించినా కాంగ్రెస్ తన గోబెల్స్ ప్రచారాన్ని మానుకోలేదు. దాని ప్రభావం ప్రజలపై కొంత పడింది. కాంగ్రెస్‌కు కలగాల్సిన లాభం కలిగింది. ఇప్పుడు ప్రభుత్వ ఇంజినీర్లే మంత్రుల సమక్షంలో చెప్పిందేమిటి? అందుకు తమ స్పందన ఏమిటో ముఖ్యమంత్రి, ఇతర మంత్రులు చెప్పాలి.

> **ఎన్నికల తర్వాత అధికారానికి వచ్చినంక అయినా కాంగ్రెస్ ఈ ప్రచారం ఆపకపోవటం ఆశ్చర్యకరం. ఎన్నికల సమయంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి అందుబాటులో ఉన్న అధికారిక లెక్కలు, తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వానికి కూడా అందుబాటులో ఉండేవే. అయినప్పటికీ ముఖ్యమంత్రి మొదలుకొని అందరూ వాటిని ఉపేక్షించి, అవే అబద్ధాలు ఇంకా చెప్తూ పోవటంలోని ఉద్దేశం ఏమనుకోవాలి? మరింత విపరీతం ఏమంటే ఈ శుక్రవారం నాడు మేడిగడ్డ వద్ద ఇంజినీర్లు వింటుండగా కూడా వారు తిరిగి అబద్ధాలాడారు. నిజాలు ఏమిటో ఇంజినీర్లు ప్రకటించిన తర్వాత సైతం తమను తాము సవరించుకోలేదు. ఇది అబద్ధాలకు పరాకాష్ఠ. ఇంత అలవోకగా అబద్ధాలాడుతూ, ఇంత అలవోకగా ఆరోపణలు చేసే పార్టీ, ప్రభుత్వ నేతల ఏ మాటలనైనా ప్రజలు విశ్వసించగలరా?**

ఇటువంటి తీరునే కాళేశ్వరానికి సంబంధించిన మరొక రెండు అంశాలలో గమనించండి. అసలు ఆ ప్రాజెక్టే వృథా అని, దానికింద ఒక్కటంటే ఒక్క ఎకరానికైనా నీళ్లివ్వలేదన్నది కాంగ్రెస్ నేతలు మొదటినుంచి చేస్తున్న ప్రచారం. ఇందులో నిజమెంత? తిరిగి స్వయంగా ఇంజినీర్లు అదే చోట చెప్పిన సమాచారం ప్రకారం, ఇప్పటివరకు కొత్తగా 98,570 ఎకరాలకు సాగునీరు అందిస్తున్నారు. ఇదిగాక కొన్ని లక్షల ఎకరాల స్థిరీకరణ ఇవే నీళ్ల వల్ల జరిగింది. అందువల్లనే పంటలు ఇంత సమృద్ధిగా పండుతున్నాయి. మరొక విషయం ప్రాజెక్టును తుమ్మిడిహట్టి నుంచి మేడిగడ్డకు మార్చటాన్ని గురించి. నీటి లభ్యత, మహారాష్ట్ర అభ్యంతరాలు, కేంద్ర జల సంఘం సూచన, వ్యాప్కోస్ అధ్యయనాల దృష్ట్యా ఈ మార్పు తప్పనిసరి అయిందని లోగడనే కేసీఆర్ ప్రభుత్వం ఇచ్చిన వివరణలను కాంగ్రెస్ వారు రాజకీయ కారణాలతో కొట్టివేశారు సరే. కానీ, ఇప్పుడు ఆ వివరణలు శుక్రవారం రోజున నేరుగా ఇంజినీర్ల నోటి నుంచి వచ్చినా పెడచెవిన పెట్టడం బాధ్యత గల వారు చేసే పనేనా? ఇదంతా నిజాయితీ గల పని అవుతుందా? పైగా, తిరిగి తుమ్మిడిహట్టి వద్దే నిర్మిస్తామని మళ్లీ వాదిస్తున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు జాతీయ హోదా కోసం కూడా కేసీఆర్ అసలు ప్రయత్నించనే లేదని వారు మరొక వ్యాఖ్య చేయటం కూడా ఆశ్చర్యం కలిగించింది. కేసీఆర్ ప్రభుత్వం ఆ మేరకు పలుమార్లు కేంద్రాన్ని కోరటం గురించి గతంలో తరచూ వెలువడిన వార్తలు మనందరికీ గుర్తున్నాయి. ఇదంతా మంత్రులకు నిజంగానే తెలియదా? ఇప్పుడా విషయం అదే శుక్రవారం సాయంత్రం బీఆర్‌ఎస్ నాయకుడు కడియం శ్రీహరి మీడియా సమావేశంలో ప్రకటిస్తూ, కేంద్రానికి కేసీఆర్ రాసిన లేఖల ప్రతులను కూడా చూపారు.

ఇది గమనించినప్పుడు, ప్రస్తుత జల వనరుల మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి గురించి వెనుకటి ఉదంతం ఒకటి గుర్తుకొస్తున్నది. ఆదిలాబాద్ జిల్లాలో పెన్‌గంగపై తలపెట్టిన చనాఖా-కొరాట ప్రాజెక్టు చిరకాలంగా పెండింగులో ఉండేది. కాంగ్రెస్ హయాంలో మహారాష్ట్రతో నీటి ఒప్పందం జరుగకపోగా కేసీఆర్ స్వయంగా ముంబై వెళ్లి అందుకు ఆ ప్రభుత్వాన్ని ఒప్పించి సంతకాలు తీసుకున్నారు. ఆ వార్త వెలువడిందే తడవు ఇక్కడ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, తాము అధికారంలో ఉండగానే ఎప్పుడో ఒప్పందం చేసుకున్నామని గట్టిగా వాదించారు. కేసీఆర్ ముంబై నుంచి బేగంపేటలో దిగుతూనే తమ ఒప్పంద ప్రతిని పైకెత్తి చూపుతూ, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి గనుక వారి ఒప్పందం నిజమైతే దానిని తెచ్చి చూపితే తాను అటు నుంచి అటే రాజ్‌భవన్‌కు వెళ్లి రాజీనామా చేయగలనని సవాల్ విసిరారు. అందుకు ఉత్తమ్ నుంచి జవాబు లేదు. తర్వాత అయినా క్షమాపణ కాకున్నా, కనీసం ఉప సంహరణ లేదు. ఒప్పందం మాట నిజం కాదని కొద్దిరోజులకు జానారెడ్డి ప్రకటించారు. ప్రస్తుతం నీటి పారుదల శాఖలో ఉత్తమ్ అధ్యక్షతన మరొక అబద్ధాల అధ్యాయం మొదలవుతున్నదనుకోవాలేమో.

> **నిజానికి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి నిండా నెల రోజులైనా పూర్తికాలేదు. మొదటి బడ్జెట్‌కు గానీ, వారు పెట్టుకున్న వందరోజుల గడువుకు గానీ, సాధారణంగా అందరం అనే హనీమూన్‌కు గానీ ఇంకా తగినంత సమయం ఉన్నది. అటువంటప్పుడు ప్రభుత్వంపై విమర్శలు చేయటం తొందరపాటు అవుతుంది. ముఖ్యమంత్రికి గతంలో మంత్రిగా పని చేసిన అనుభవం లేదు. పలువురు ఇతర మంత్రులకు కూడా. అందువల్ల వారంతా తగిన సమయం తీసుకొని బాధ్యతగా పాలిస్తూ, ఓపికగా, నేర్పుగా వ్యవహరిస్తూ విషయాలు తెలుసుకోవాలి. సంయమనం చూపి ప్రతిపక్షాలను కూడా కలుపుకొనిపోతూ వారి సహకారాన్ని పొందాలి. కానీ, జరుగుతున్నదేమిటి? వారి ప్రతి ఒక్క మాటా, చేతా కోరికోరి కొరివితో తల గోక్కున్నట్టే, ప్రతిపక్షాలను అబద్ధాలతో కావాలని రెచ్చగొడుతున్నట్టే సాగుతున్నది. కనుక వారు తగు పరిణతి చూపటం వారికే మంచిది. పరిపాలనకు, రాష్ర్టానికి కూడా.**

కాంగ్రెస్ నేతలకు అబద్ధాల నాయకులు అని మాత్రమే కాదు, అధికారం కోసం అమలు చేయలేని హామీలిచ్చి, వాటిని అమలు చేయలేక అప్పులంటూ, శ్వేతపత్రాలంటూ తడబడుతున్నారనే మాట రావటం ఇప్పటికే మొదలైంది. ఉదాహరణకు నిరుద్యోగ భృతి రూ.4000 ఇవ్వగలమని మ్యానిఫెస్టోలో ప్రకటించి, తాము ఆ మాట అననే లేదంటూ ఆర్థికమంత్రి భట్టి విక్రమార్క అసెంబ్లీలో వాదించటం. దీన్నిబట్టి నిరుద్యోగులకు, ప్రజలకు కలుగుతున్న అభిప్రాయమేమిటి? ఇట్లా చెప్పాలంటే అనేకం ఉన్నాయి. అవి అందరూ ఎత్తి చూపుతున్నవే. రెండు హామీలను ఇప్పటికే అమలు చేశామన్న ప్రచారం మరొక అబద్ధం. మహాలక్ష్మి, చేయూత అనే రెండింటిలో మొత్తం ఐదు అంశాలు ఉండగా, రెండు మాత్రం అమలై ఇంకా మూడు మిగిలే ఉన్నాయి. అవి మున్ముందు అమలు కావచ్చుగాక. కానీ, ఇప్పటికే అయ్యాయన్న ప్రచారం ఇంకొక అబద్ధమవుతున్నది. లంకె బిందెలున్నాయనుకొని వస్తే ఖాళీ కుండలున్నాయన్న ముఖ్యమంత్రి వ్యాఖ్య మరొక వింత. అప్పులకుప్ప అని కొన్ని నెలల పాటు ప్రచారంతో హోరెత్తించినవారు, లంకె బిందెలు ఉంటాయని ఎట్లా అనుకున్నారు?

హామీల అమలులో తడబాట్లు, వైఫల్యాలు ఒక ఎత్తు. కానీ ప్రజలకు పదేపదే అబద్ధాలు చెప్పటం మరొక ఎత్తు. అది కూడా ఇన్నిన్ని అబద్ధాలు, ఇంత అలవోకగా, ఇన్నిన్నిసార్లు చెప్పటం. అధికారానికి వచ్చినంక కూడా. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పరిభాషలో చెప్పాలంటే ఇదంతా తనకు గానీ, తన ప్రభుత్వానికి గానీ 'శోభ'నివ్వదు. 'శోభా నహీం దేతా' అనేది వాస్తవానికి ఉత్తరాది ప్రయోగం. అది ఎంతో ఉదాత్తమైనది. మరి అటువంటి పరిభాషను ఉపయోగించే ఆయన అందుకు తగినట్టు మాట్లాడటం, వ్యవహరించటం ఉచితం కాబోదా? తనకు ఇతరత్రా లోగడ నుంచి కూడా 'శోభ'ను ఇవ్వనివిధంగా మాట్లాడుతారని, వ్యవహరిస్తారనే పేరున్నది. ఫలితాలు వెలువడినంక ఒకచోట తను, ఇంకా అంతకుముందు వలె మాట్లాడాలని ఆశించవద్దంటూ సహచరులతో అనటం చూశాం కూడా. మరి ఆయన మారిన సూచనలు ఏమైనా కనిపిస్తున్నాయా? దీనంతటికి మూల కారణం, అధికార ప్రయోజనాల కోసం ప్రజలకు అబద్ధాల ద్వారా మేధో నిర్బంధం, బ్రెయిన్ కండిషనింగ్ చేయాలన్న ప్రయత్నమే కాదా? ఇది ఒక ఎత్తుగడ. కానీ, బలహీనమైనది. ఎందుకంటే, ఇటువంటి ఎత్తుగడలు త్వరలోనే తేలిపోతాయి. తేలిపోతున్నట్టు కూడా కనిపిస్తున్నది.

> **ఉదాహరణకు నిరుద్యోగ భృతి రూ.4000 ఇవ్వగలమని మ్యానిఫెస్టోలో ప్రకటించి, తాము ఆ మాట అననే లేదంటూ ఆర్థికమంత్రి భట్టి విక్రమార్క అసెంబ్లీలో వాదించటం. దీన్నిబట్టి నిరుద్యోగులకు, ప్రజలకు కలుగుతున్న అభిప్రాయమేమిటి? ఇట్లా చెప్పాలంటే అనేకం ఉన్నాయి.**

---



# తెలంగాణను గెలిపించి, తాను ఓడిండు!



**వై.సతీష్‌రెడ్డి**
96414 66666

**కొవ్వొత్తి తాను కరిగిపోతూ మనకు వెలుగునిస్తుంది. గొప్ప నాయకుడు తాను ఓడిపోయినా తన ప్రజలను, తన సమాజాన్ని నిలబెడతాడు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ విషయంలో ఇదే జరిగింది. కేసీఆర్ తెలంగాణను గెలిపించి, తాను ఓడిపోయారు.**

ఒకనాడు తెలంగాణ అంటే కరువు ప్రాంతం, వలసలకు నెలవు. ఒకనాడు తెలంగాణ అంటే రైతుల ఆత్మహత్యలకు వేదిక. ఇలా ఎన్నో సమస్యలు, కష్టాలు. ఏది చెప్పినా తెలంగాణనే గుర్తొచ్చేది. కానీ.. నేడు తెలంగాణ వేరు. స్వరాష్ట్రం సిద్ధించిన తర్వాత పదేండ్లలో తెలంగాణ ప్రాంతం రూపు రేఖలు మారిపోయాయి. ప్రతీ రంగంలో దేశంలోనే తెలంగాణ అగ్రభాగాన నిలబడేలా చేశారు తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్. ఒకనాడు ఓడగొట్టబడిన తెలంగాణను గెలిపించి ప్రపంచం ముందు తలెత్తుకొని నిలబడేలా చేశారు. ఏ పనిచేసినా అందులో లీనమవ్వాలి. మన అనుకున్నప్పుడే మంచి జరుగుతుంది. మంచి ఫలితాలు వస్తాయి. అందుకే కేసీఆర్ తెలంగాణే నా కుటుంబం అనుకున్నారు. ప్రజలు బాగుంటేనే, తెలంగాణ బాగుంటుందని భావించారు. నా తెలంగాణ కుటుంబం బాగుండి, నా కుటుంబసభ్యులైన ప్రజలు మంచివాళ్లు అని అందరు చెప్పుకొనేలా చేసి ప్రపంచం మొత్తం తెలంగాణ వైపు చూసేలా చేశారు.


నాడు తెలంగాణ అంటే ఆమడదూరం పారిపోయిన కంపెనీలు సైతం వచ్చి లైన్లో నిలబడేలా చేశారు. అంటే తెలంగాణను గెలిపించారు. కానీ ఈ తెలంగాణ సమాజం మాత్రం ఆయనను ఓడించింది. అంటే తెలంగాణను ఓడించింది. ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న పరిస్థితులు, పాలకుల మాటలు, ముఖ్యంగా ముఖ్యమంత్రి పదవిలో కూర్చున్న వ్యక్తి మాట్లాడే మాటలు చూస్తే తెలంగాణ ఓడిపోయిందని చెప్పడానికి ఈ 20 రోజుల సమయం చాలా ఎక్కువే. పరాయి పాలనలో అన్నింటా దోపిడికి గుర్రై చిక్కి శల్యమైన తెలంగాణను అనతికాలంలో ప్రపంచం ముందు ఒక అద్భుత రాష్ట్రంగా, అభివృద్ధికి రోల్ మాడల్‌గా నిలబెట్టింది కేసీఆర్ మేధోశక్తి. అందుకే కొత్త రాష్ట్రమైనా సరే మున్సిపాలిటీలకు, పంచాయతీలకు, ఇతర ప్రభుత్వశాఖల పనితీరుకు కేంద్ర ప్రభుత్వం ఏ అవార్డు ఇచ్చినా అందులో అగ్రభాగం తెలంగాణే అందుకున్నది. పెట్టుబడులకు స్వర్గధామమైంది.

> **సమర్థవంతమైన నాయకత్వం ఉంటేనే ఇలాంటివి సాధ్యమవుతాయి. ఒక నమ్మకమైన పాలకుడు, పాలనను సజావుగా నడిపించే వ్యక్తి ఉంటేనే అన్నీ సక్రమంగా కొనసాగుతాయి. చిరు వ్యాపారులైనా, లక్షల కోట్ల వార్షికాదాయం ఉన్న బడా వ్యాపారవేత్తలైనా ఏ ఆందోళన లేకుండా ఉంటారు. నిన్న మొన్నటి వరకు మన రాష్ట్ర రియల్ ఎస్టేట్ వ్యాపారులే కాదు, పక్క రాష్ట్ర వ్యాపారులకు కూడా తమ ప్రాంతంలో పాలకుల మీద, పాలసీల మీద నమ్మకం లేక ఇక్కడికి వచ్చి పెట్టుబడులు పెట్టారు. వ్యాపారం చేసుకుంటున్నారు. కేసీఆర్‌పై ఉన్న నమ్మకం, ఆయన హయాంలో తీసుకొచ్చిన సులభతర విధానాల వల్లనే ఇదంతా సాధ్యమైంది.**

పదేండ్ల పాటు అహర్నిశలు శ్రమించి, ఇటుక.. ఇటుక పేర్చి ఇల్లు కట్టినట్టుగా నిర్మించిన నమ్మకాన్ని కొత్త పాలకులు తమ చిల్లర మాటలతో బూడిదలో పోసిన పన్నీరులా చేస్తున్నారు. కేసీఆర్ ఉద్యమ నాయకుడిగా ఉన్నప్పుడు గానీ, ముఖ్యమంత్రి అయ్యాక గానీ, మొన్నటి ఎన్నికల ప్రచారంలో గానీ ఏనాడూ తెలంగాణను తక్కువ చేసి మాట్లాడలేదు. తెలంగాణ ప్రజలకు ఇబ్బంది రానీయలేదు. నాకు ఏమీ అవసరం లేదు, రాష్ట్రం సాధించానన్న గొప్ప పేరు, అభివృద్ధి చేశానన్న కీర్తి చాలంటూ ఆయన చెప్పిన మాటలు అందరం విన్నాం.రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఆయన ఉన్నన్ని రోజులు ప్రజలకు ఏ చిన్న ఇబ్బంది రానీయలేదు. ఏ ఒక్క సంక్షేమ పథకం ఒక్క రోజు కూడా ఆగలేదు. 11 సీజన్లకు ఠంచన్‌గా రైతుబంధు రైతుల అకౌంట్లలో జమయింది. ప్రతి నెలా పింఛన్లు వచ్చాయి. రాష్ట్రంలో ప్రభుత్వం మారింది మొదలు పరిస్థితులు కూడా పూర్తిగా మారిపోయాయి. ఏ కుర్చీలో కూర్చొని ఒక వ్యక్తి రాష్ట్ర ఔన్నత్యాన్ని ఖండాంతరాలు దాటించారో.. అదే కుర్చీలో కూర్చొని మరో వ్యక్తి ఇప్పుడు ఖండాంతరాల్లో రాష్ట్రంపై అపఖ్యాతిని మోపుతున్నారు. 'మార్పు రావాలి, మార్పు రావాలి' అని సదరు పార్టీ ఇచ్చిన నినాదానికి అర్థం ఇదేనేమో. కానీ ఈ మార్పు ఎవరి కోసం? ఎందుకోసం? రాష్ట్ర అభివృద్ధికి గొడ్డలిపెట్టు లాంటి ఈ మార్పును ఏ ఒక్కరూ హర్షించరు.

(వ్యాసకర్త: కన్వీనర్, బీఆర్‌ఎస్ సోషల్ మీడియా విభాగం)

---




## నా కుటుంబమే బ్రిజ్‌భూషణ్ టార్గెట్!

*బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్‌కు సంబంధించిన ఐటీసెల్ మాపై దుష్ప్రచారం చేస్తున్నది. మాకు వ్యతిరేకంగా ప్రచారం చేస్తున్నవారు ఆయన మనుషులే. కొత్త పాలకవర్గం, అడ్‌హాక్ కమిటీతో రెజ్లర్లకు ఎటువంటి ఇబ్బంది లేదు. అతని అనుచరుడు సంజయ్ సింగ్‌తోనే మాకు సమస్య. అందుకే డబ్ల్యూఎఫ్‌ఐ కొత్త పాలకవర్గం నుంచి సంజయ్ సింగ్‌ను తొలగించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాం. బ్రిజ్‌భూషణ్ నా కుటుంబాన్ని టార్గెట్ చేస్తున్నాడు. మమ్మల్ని కాపాడాల్సిన బాధ్యత కేంద్రానిదే.*

**- సాక్షి మాలిక్,** రెజ్లర్

